# శతమానం భవతి!

కామేశ్వర్రావు మంచి మాటకారి. చక్కటి సెన్స్ ఆఫ్ హ్యూమర్ గల వ్యక్తి. ఎప్పుడూ నవ్వుతూ ఎదుటివాళ్లను నవ్విస్తూంటాడు. అతన్ని చూసిన వాళ్ళు "ఏ చీకూచింతా లేని నిత్య సంతోషి కామేశ్వర్రావు" అనుకుంటారు.

అన్నిటికన్నా ముఖ్యమైంది అతని బంధుప్రీతి. అతని కన్నా వయస్సులో పెద్దవాళ్లని 'అక్కా' అనీ 'బావా' అని చిన్నవాళ్లని 'చెల్లెమ్మా' అనీ, 'తమ్ముడూ' అనీ పిలుస్తూ ఎంతో ఆప్యాయత చూపిస్తాడు.

కామేశ్వర్రావుకి చిన్నతనంలో అతని 15వ ఏట చిన్నజబ్బుచేసి తలమీద జుట్టంతా నెరిసిపోయి ముగ్గుబుట్టలా తయారైంది. దాన్ని గురించి అతనేమీ పట్టించుకోలేదు. బెంగపడి దిగులుచెందలేదు. 'డై' వేసుకోమని ఎందరో అతనికి సలహా ఇచ్చేరు. కాని వినలేదు. దాంతో అతడ్ని అందరూ 'కామయ్య తాతా' అనీ 'తాతడూ' అనీ 'తాత బావా' అనీ పిలవడం మొదలుపెట్టేరు.

"చూసేరా! ఈ నెరిసిన తల నాకెంతో గౌరవం, పెద్దరికం తెచ్చింది' అంటాడు. పల్లెటూరి హైస్కూల్లో హెడ్‌మాస్టర్ ఉద్యోగం చేస్తున్నాడు. నాకూ నా శ్రీమతికీ దగ్గర బంధువే! అతన్ని మా శ్రీమతి "తాతబావా" అని పిలుస్తుంది. అతను తరచూ ఏదో పనిమీదపట్నం వస్తుంటాడు. వచ్చినప్పుడల్లా మా ఇంట్లోనే అతని బస. అతనెప్పుడూ వొట్టి చేతుల్తో రాడు. పళ్లూ, కాయలు, పల్లీలూ, పిల్లలకోసం జంతికలో, చక్కిలాలో, సున్ని ఉండలో చేయించి తెస్తాడు.

"ఎందుకు తాత బావా! వచ్చినప్పుడల్లా ఇవన్నీ మోసుకొస్తావు" అని మా ఆవిడెప్పుడూ అతనితో పోట్లాడుతుంది. తీసుకోడానికి మొహమాటపడుతుంది.

"మీ అక్కేమీ అలసిపోదులెవమ్మా! చేసివ్వడానికి, అయినా-

అగ్నిహోత్రం గృహం క్షేత్రం గర్భిణీం వృద్ధబాలకౌ,

రిక్తహస్తేన నోపేయా ద్రాజానం దైవం గురుమ్" అన్నారు పెద్దలు.

"కామేశ్వర్రావు మంచి భోజన ప్రియుడు. మా ఆవిడ అతనికి పలురకాల వంటకాలు చేసి పెడుతుంది . అతను తృప్తిగా తిని సంతోషిస్తాడు. భోజనం చేసేక తీరుబడిగా కూర్చొని కబుర్లు చెప్తూ తాంబూలం వేసుకోవడం అతనికి అలవాటు.

ఓ పర్యాయం ఇంట్లో వక్కపొడి లేక అతనికి తాంబూలంలోకి పీటీ వక్కలు ఇచ్చింది మా ఆవిడ. అతను రెండు వక్కలు నోట్లో వేసుకొని ఆకులకు సున్నం రాసి ఈనెలు తీసి చిలకలు చుట్టి చేత్తో పట్టుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. వక్కలు నమలలేక ఇబ్బంది పడుతున్నాడని మా శ్రీమతి ఎంతో నొచ్చుకొని-

"ఏం తాత బావా! నూరిప్పింతునా!" అంది.

"నూరిప్పించితే మిగతా పదహారు ఎవరిస్తారు మరదలా? అంచేత మొత్తం నూటపదహార్లిప్పిస్తే వేంఠనే 'శతమానం భవతి!' అని దీవిస్తా" అన్నాడు కామేహ్వర్రావు నవ్వుతూ.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 12-6-1997)✪